నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
హైదరాబాద్, శనివారం 7 జూన్ 2025 | RANGAREDDY

## 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ)/ అబిడ్స్ : ఆస్తమా వ్యాధిగ్రస్తులకు నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. ఈమేరకు వేలాది మంది వచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వివిధ రూట్ల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు టీజీఆర్టీసీ శుక్రవారం ప్రకటించింది. ముఖ్యమైన బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టు నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు బస్సులను 8వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. వాటిలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్, చర్లపల్లి రైల్వేస్టేషన్‌తో పాటు జేబీఎస్, ఎంజీబీఎస్, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వివిధ బస్ డిపోల నుంచి బస్సులను నడుపుతామని చెప్పారు. ఆయా రూట్లలో మొత్తం 60 బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ముఖ్యమైన ప్రాంతాల నుంచి మరో 80 బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కాగా, ఈ ఏడాది ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం పంపిణీ కోసం 42 క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తెలిపారు.



శిథిలావస్థకు చేరిన కొహెడ పాఠశాల భవనం

# సంక్షేమం గాలికి.. అటకెక్కిన ఆరోగ్యం

**ఆరు గ్యారెంటీలు, 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ**






ఆరు గ్యారెంటీలు, 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిచ్చి కేసీఆర్ కిట్స్, న్యూట్రిషన్ కిట్స్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర సంక్షేమ పథకాలను దేశంలోనే ఎక్కడాలేని విధంగా అమలు చేసింది. ఎన్నో సంక్షేమ పథకాలు, పింఛన్ల పెంపు, పెట్టుబడి సాయం పెంపు తదితర సాధ్యంకాని హామీలనిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి సంబంధించి ఏ ఒక్క కొత్త పథకాన్ని కూడా పూర్తిగా అమల్లోకి తీసుకురాకపోవడం గమనార్హం. కొత్త పథకాలు దేవుడెరుగు.. ఉన్న పథకాలను అమలుచేయకపోవడం సిగ్గుచేటు. ప్రధానంగా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా, బలవర్ధకంగా ఉండాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన న్యూట్రిషన్ కిట్ల పంపిణీ అటకెక్కింది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన గతేడాది నుంచి న్యూట్రిషన్ కిట్స్ పథకానికి గ్రహణం పట్టింది. మరోవైపు గర్భిణులు, శిశువులకు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన కేసీఆర్ కిట్స్ పథకాన్ని ఎంసీహెచ్ కిట్స్‌గా పేరు మార్చినప్పటికీ పంపిణీని పూర్తిగా నిలిపివేసింది. మహిళల సంక్షేమాన్ని గాలికి వదిలేసి పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రేవంత్ ప్రభుత్వంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- వికారాబాద్, జూన్ 6, (నమస్తే తెలంగాణ)

పుట్టబోయే శిశువు పూర్తి ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగించేందుకు కేసీఆర్ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన న్యూట్రిషన్ కిట్స్ సరఫరా గతేడాదిగా పూర్తిగా నిలిచిపోయింది. న్యూట్రిషన్ కిట్స్ పథకాన్ని నిలిపివేయడంతో జిల్లాలో గతేడాదిగా సుమారు 9 వేల మంది గర్భిణులకు సుమారు 18 వేల న్యూట్రిషన్ కిట్స్ అందలేదు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకు ఐదో నెల, తొమ్మిదో నెలలో రెండు సార్లు రూ.2 వేల విలువ చేసే పోషకాహారాలతో కూడిన కిట్లను కేసీఆర్ ప్రభుత్వం గర్భిణులకు అందజేసింది. కిట్‌లో రెండు కిలోల న్యూట్రిషన్ మిక్స్‌డ్ పౌడర్‌తోపాటు కిలో ఖర్జూర, 500 గ్రాముల నెయ్యి, ఐరన్ సిరప్ రెండు బాటిళ్లు, ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు తదితర వస్తువులుండేవి. గతేడాదిగా న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ నిలిచిపోవడంతో పుట్టిన బిడ్డల్లో పోషకాహార లోపం సమస్యలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.







- కేసీఆర్ కిట్స్‌ను ఎంసీహెచ్ కిట్స్‌గా పేరు మార్చినప్పటికీ పూర్తిగా నిలిచిపోయిన పంపిణీ
- న్యూట్రిషన్ కిట్స్‌కూ మంగళం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్విఘ్నంగా కొనసాగిన కేసీఆర్ కిట్స్, న్యూట్రిషన్ కిట్స్, అమ్మ ఒడి పథకాలు
- ఏడాదిలో జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో 8581 ప్రసవాలు
- ఎవరికీ అందని కిట్స్, పౌష్టికాహారలోపంతో సతమతం

### ఆగిన కేసీఆర్ కిట్స్ పంపిణీ, అందని ఆర్థిక సాయం

గర్భిణులు, పుట్టబోయే శిశువుల సంరక్షణతోపాటు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను పెంచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన కేసీఆర్ కిట్స్ పథకం నిలిచిపోయింది. గత ఏడాదిన్నరగా కేసీఆర్ కిట్లతోపాటు అమ్మఒడి కింద ఇచ్చే ఆర్థిక సాయం పాప పుడితే రూ.13 వేలు, బాబు పుడితే రూ.12 వేలు కూడా అందడంలేదు. కేసీఆర్ కిట్స్‌ను ఎంసీహెచ్ కిట్స్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పేరు మార్చి మంగళం పాడింది. దీంతో ప్రభుత్వాసుపత్రులలో ప్రసవాల సంఖ్య తగ్గిపోయింది. జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ హయాంలో అర్హులైన 37,176 మందికి కేసీఆర్ కిట్స్‌ను పంపిణీ చేయగా, అమ్మఒడిలో భాగంగా సుమారు రూ.30 కోట్ల వరకు ఆర్థిక సాయాన్ని అందజేసింది.

# సమస్యల వలయంలో సర్కార్ బడులు

- శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలు
- నిధులు మంజూరు కాక కనీస సౌకర్యాలు కూడా కనుమరుగు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రశ్నార్థకంగా సర్కారు బడుల దుస్థితి



కమ్మగూడ ప్రాథమిక పాఠశాల భవనం



కొహెడ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫిల్టర్

తుర్కయాంజాల్, జూన్ 6 : సర్కారు బడులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకల వసతులతో ఆహ్లాదకరంగా సాగిన సర్కారు చదువు ప్రస్తుత ప్రభుత్వ తీరుతో ప్రశ్నార్థకంగా మారింది. త్వరలో పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో సర్కారు బడుల్లో వెంటాడుతున్న సమస్యలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కొన్ని బడుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో తమ పిల్లలను చేర్పించడానికి జంకుతున్నారు. శుక్రవారం నుంచి బడిబాట కార్యక్రమం మొదలు కాగా సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు అడిగే ప్రశ్నలకు ఏ విధంగా సమాధానం చెప్పాలనే సందిగ్ధంలో ఉపాధ్యాయులున్నారు.

### శిథిలావస్థలో తరగతి గదులు

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కొహెడ, కమ్మగూడలోని పాఠశాలల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. సర్కారు బడుల నిర్వహణకు ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడంతో పాఠశాల తరగతి గదుల మరమ్మతులు జరుగుతాయా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ముఖ్యంగా కొహెడ పాఠశాలలోని ఓ తరగతి గది శిథిలావస్థకు చేరి స్లాబ్ కూలిపోయింది. పాఠశాల సెలవు దినంలో స్లాబ్ కూలిపోవడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. పాఠశాల ఆవరణలో గుంతలు ఉండడంతో కొద్దిపాటి వర్షానికి జలమయంగా మారుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. తరగతి గదులు పెచ్చులూడి విద్యార్థులు గాయాలపాలైన సంఘటనలు అనేకమున్నాయని స్థానికులు వాపోతున్నారు. పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు చదువు దూరం కానుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సర్కారు బడుల్లో సమస్యలను పరిష్కరించకపోతే పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం మంచి ఫలితాలు సాధిస్తున్న కొహెడ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య సైతం గణనీయంగా ఉంటుంది. ఇలాంటి పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే మరింత మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకోవడానికి ఆసక్తి చూపుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.



బొంరాస్‌పేట మండలం అనంతపూర్ గ్రామంలో అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ఎలా చేశారని కాంగ్రెస్ నాయకులతో గొడవకు దిగిన గ్రామస్తులు

# అనర్హులకు ఇండ్ల మంజూరా..?

- సీఎం ఇలాఖాలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో గందరగోళం
- కాంగ్రెస్ నాయకులకే ఇందిరమ్మ ఇండ్లు
- ఇండ్లు ఉన్నోళ్లకే మళ్లీ కేటాయిస్తరా..!
- అధికారులను నిలదీసిన లబ్ధిదారులు

బొంరాస్‌పేట, జూన్ 6 : సీఎం సొంత నియోజకవర్గంలో పథకాల అమలు అస్తవ్యస్తంగా ఉండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బొంరాస్‌పేట పరిధిలోని బాపల్లి గ్రామపంచాయతీకి అనుబంధంగా ఉన్న అనంతపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం నెలకొన్నది. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ముగ్గువేయడానికి వచ్చిన అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజలు నిలదీశారు. అర్హత ఉన్నవారిని వదిలి ఇప్పటికే పక్కా ఇల్లు ఉన్నవాళ్లకు ఇందిరమ్మ ఇండ్లు ఎలా మంజూరు చేశారని నిలదీశారు. గ్రామ పంచాయతీకి మొదటి విడతలో అర్హత కలిగినవారు 16 మంది ఉండగా.. అందులో 10 మందికి ఇండ్లు మంజూరయ్యాయి. అందులో 8 మందిని బాపల్లితండాకు, ఒకరిని అనంతపూర్‌కు, మరొకరిని పాలబావి తండాకు కేటాయించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు లిస్టులో ఉన్నవారిని కాదని ఇతరుల పేరుపై ఇండ్లను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ఎంపిక చేసినవారికి ప్రస్తుతం ఆర్‌సీసీ ఇండ్లు ఉన్నాయని.. పాతవాటిని తొలగించి కొత్తగా నిర్మాణం చేస్తున్నారని.. ఇండ్లు ఉన్నవారికి ఇండ్లను కేటాయించడమేంటని ప్రశ్నించారు. ఇండ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కమిటీలో చాలా వరకు కాంగ్రెస్ కార్యకర్తలకే అవకాశం కల్పించడంతో ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఎంపిక కమిటీలకు కూడా తెలియకుండా లబ్ధిదారులను ఎంపిక చేయడం చాలా విడ్డూరంగా ఉందని పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ఇటువంటి పరిస్థితిని చూస్తుంటే ఇందిరమ్మ రాజ్యంలా లేదని, కాంగ్రెస్ రాజ్యంగా తలపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఓటేసి గెలిపిస్తే అన్యాయం చేస్తారా..

రేవంత్‌రెడ్డి సీఎం కావడం వల్ల నియోజకవర్గానికి అన్నింటా మేలు జరుగుతుందని భావించామని, కానీ కాంగ్రెస్ నాయకుల వైఖరి కారణంగా ప్రజలు సంక్షేమ పథకాలు అందుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ఇండ్లులేని పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని సీఎం హామీ ఇచ్చారు, కానీ అసలైన లబ్ధిదారులకు కాకుండా కాంగ్రెస్ నాయకులు కనుసన్నల్లో ఉన్నవారికే ఇండ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అసలైన లబ్ధిదారులు అధికారులను సంప్రదించినా ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని, అధికారులను కాకుండా స్థానికంగా కాంగ్రెస్ నాయకులను సంప్రదించాల్సిన పరిస్థితి ప్రజలకు ఏర్పడిందని వాపోతున్నారు. సీఎం నియోజకవర్గంలోనే ఇటువంటి పరిస్థితి నెలకొనడమేంటని, కాంగ్రెస్ కార్యకర్తలకు అర్హతలు లేకున్నా సంక్షేమ పథకాలిచ్చి, అర్హులైన సామాన్యులకు అన్యాయం చేస్తారా.. అని నిలదీస్తున్నారు. ఓటేసి గెలిపించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకునే బాధ్యత ఇదేనా అని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు కాంగ్రెస్ కార్యకర్తలే అవసరమా..? ప్రజలు అవసరం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని కొన్ని ప్రాంతాల్లో ఉన్న ఇంటిని కూడా కూల్చుకొని ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురు చూస్తున్న పరిస్థితులున్నాయని, ఇప్పటికైనా సీఎం స్పందించి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అదును ముంచుకొస్తున్నా.. అందని 'భరోసా'



- యాసంగి సీజన్‌లో అతివృష్టి, అనావృష్టితో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- ప్రభుత్వం రైతు భరోసా సాయం అందించకపోవడంతో అప్పులు చేసి మరీ విత్తనాలు, ఎరువులు కొనుగోలు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సీజన్‌కు ముందే అందిన సాయం
- జిల్లావ్యాప్తంగా రైతు భరోసాకు అర్హులు 3.24 లక్షల మంది అన్నదాతలు
- గత సీజన్‌లో 4 ఎకరాల లోపు ఉన్నవారికే అందిన సాయం

రంగారెడ్డి, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : వానకాలం పంటల సీజన్ గడువు ముంచుకొస్తున్నప్పటికీ రైతు భరోసాపై ప్రభుత్వం నోరు మెదపడంలేదు. వర్షాలు ముందుగానే ప్రారంభం కావడంతో పంటలు వేసుకోవడనికి రైతులు సిద్ధమవుతున్నారు. కాని, పెట్టుబడి సాయం అందక అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత యాసంగి సీజన్‌లో అతివృష్టి, అనావృష్టితో పెట్టిన పెట్టుబడి కూడా దక్కక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సీజన్‌లోనైనా రైతు భరోసా ముందుగానే ఇస్తే కొంతమేరకైనా నిలదొక్కుకుంటామని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వానకాలం సీజన్‌లో వరి, పత్తి, ఆముదం, మొక్కజొన్న పంటలు వేస్తారు. ప్రభుత్వం రైతు భరోసా సాయం అందించకపోవడంతో అప్పులు చేసి మరీ రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీజన్‌కు ముందే రైతు బంధు పథకం ద్వారా ఎకరాకు రూ.5వేల చొప్పున ముందుగానే వేసేవారు. కాని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు పేరును రైతు భరోసాగా మార్చినప్పటికీ అన్నదాతలకు మాత్రం భరోసా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కష్టగట్టిందని, తమకు ఏమాత్రం ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడంలేదని పలువురు అన్నదాతలు వాపోతున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాగు భూములకు రైతు భరోసా ఇస్తామని చెప్పి అనేక మంది రైతుల పేర్లను తొలగించింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 3.24 లక్షల మంది రైతులను అర్హులుగా ప్రకటించింది. వీరికి రైతు భరోసా కింద ఏటా రూ.300 కోట్లకు పైగా సాయం ఇవ్వాల్సి ఉంది. కాని, ప్రభుత్వం మాత్రం రైతు భరోసాపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. గత యాసంగి సీజన్‌లో 4 ఎకరాల లోపున్నవారికి మాత్రమే సాయమందించింది. ఈ సీజన్‌లోనైనా రైతు భరోసా ఇస్తారా.. లేదా అనే అనుమానంతో ఉన్నారు.

### అతివృష్టి, అనావృష్టితో తీవ్ర నష్టం

గత యాసంగి సీజన్ ప్రారంభంలోనే బావులు, బోర్లు ఎండిపోయి భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోయి పంట పొలాలు ఎక్కడికక్కడే ఎండిపోయాయి. జిల్లాలోని మంచాల, యాచారం, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్, కేశంపేట, కొందుర్గు, షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో పెద్దఎత్తున పంట పొలాలు ఎండిపోయాయి. రైతులు పంటల కోసం పెద్దఎత్తున డబ్బులు ఖర్చుపెట్టి ఎండిన పంటలను పశువుల మేతకు వదిలిపెట్టారు. ఉన్న కాస్త పంటలు చేతికందే సమయంలో అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్ల వాన పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించింది.

### బ్లాక్‌లిస్టులో ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాలు

రంగారెడ్డిజిల్లాలోని ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న పెద్దఅంబర్‌పేట్, ఆదిబట్ల, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ మున్సిపాలిటీలు అర్బన్ ప్రాంతాలుగా గుర్తించి ప్రభుత్వం ఆ ప్రాంతాల్లోని రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాల్లోని రైతులు అప్పులు చేసి పంటలువేస్తున్నారు. కాని, అతివృష్టి, అనావృష్టి వారిని మరింత కుంగదీశాయి.

### అర్హులందరికీ రైతు భరోసా అందజేయాలి



ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఇప్పటి వరకు పెద్దఎత్తున రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. భూమిని నమ్ముకుని జీవిస్తున్న రైతుల భూములను బ్లాక్‌లిస్టులో పెట్టి రైతు భరోసా సాయం అందించకపోవటం ప్రభుత్వానికి సరైంది కాదు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందించడంతోపాటు ఎన్నికల్లో రైతులకిచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చాలి.

- ముద్దు అంజిరెడ్డి, ఉత్తమ రైతు

### సకాలంలో సాయం చేయాలి



రైతు భరోసాను సకాలంలో అన్నదాతల ఖాతాల్లో జమ చేయాలి. దీంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే చిన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. యాసంగిలో సాయమందక ఎన్నో అవస్థలుపడ్డాం. పంట నష్టం కావడంతో అప్పులపాలయ్యాం. సర్కారు ఆలోచన చేసి సాయం అందించాలని కోరుతున్నా.

- జంగయ్యగౌడ్, నల్లచెరువు, మాడ్గుల మండలం

### రైతులను ఆదుకోవాలి



అన్నదాతలకు రైతు భరోసా డబ్బులివ్వాలి. వానకాలం పంటల సీజన్ వస్తున్న సందర్భంగా సాయమందిస్తే రైతులకు ఆసరాగా ఉంటుంది. ఇంతకుముందు డబ్బులివ్వకుండా సర్కారు నిర్లక్ష్యం చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాయమందించి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నా.

- శంకరయ్య, నాగిళ్ల, మాడ్గుల మండలం

### విశ్వశాంతి మహాశక్తిగా మహాగణపతి




ఖైరతాబాద్ మహా గణనాథుడు ఈ ఏడాది శ్రీ విశ్వశాంతి మహా శక్తి గణపతిగా కొలువు దీరనున్నాడు. 71వ వసంతంలోకి ప్రవేశించిన నేపథ్యంలో 69 అడుగుల మట్టి ప్రతిమను ప్రతిష్ఠించనున్నారు. కాగా శుక్రవారం సాయంత్రం శోభాయమానంగా కర్ర పూజ క్రతువు నిర్వహించారు.

